క్లుప్తంగా

నేడు సుబ్రహ్మణ్య షష్టి


ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

అడ్డతీగల: నేడు సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకట రామయ్య తెలిపారు. తొలిత క్షేత్రంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ నిర్మాణ దాతలతో పాటు పలువురు దంపతులు స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొంటారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటన రేపు

అడ్డతీగల: మండలంలోని మంగళవారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనన్నట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు అడ్డతీగల జీసీసీ ఆఫీస్ వద్ద ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఇరువురు పాల్గొంటారన్నారు. సాయంత్రం 4 గంటలకు అడ్డతీగలలోని ఇటీవల నిర్మించిన సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొవాలన్నారు.

క్యాలండర్ ఆవిష్కరణ


క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న పాస్టర్ సంజీవ్‌కుమార్

అరకులోయ రూరల్: మండలంలో మాడగడ పంచాయతీ బెంజిపూర్ లూథరన్ చర్చిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 2024 సంవత్సర క్యాలండర్‌ను లూథరన్ మిషన్ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పాస్టర్లు, చర్చి సంఘస్తులకు క్యాలండర్లను పంపిణీ చేశారు. పాస్టర్లు సదానందం, అబ్రహాం, దావీదు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం


బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందచేస్తున్న దృశ్యం


వీఆర్‌పురం: సీతంపేట గ్రామంలో శుక్రవారం జరిగిన షార్ట్‌సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయిన ముత్యాల చిన్నవెంకటేష్ కుటుంబానికి ఆదివారం కృష్ణార్జున ఫౌండేషన్ అధ్యక్షుడు కాకునూరు కృష్ణార్జునరావు నిత్యావసర సరకులు ,వంట సామగ్రి వితరణగా అందచేశారు. ఎస్.శ్రీనివాస్‌రావు, బి.శ్రీనివాస రావు , సీహెచ్.రామారావు, జి.శ్రీనివాస్ , జి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

వీఆర్ పురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని, పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నోముల రామారావు అన్నారు. వికసిత్ భారత సంకల్ప యాత్రలో భాగంగా వీఆర్ పురం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ప్రధానమంత్రి ఉజ్వల్ గ్యాస్ పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనక్షన్‌లను మహిళలు అందించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ సోడె నరసమ్మ, నాయకులు రమేష్ , సత్తిబాబు, రాంబాబు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముంచంగిపుట్టు: మండలంలోని సోమ, మంగళవారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ జి.రాంబాబు ఆదివారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల-1 సమీపంలోని చెట్లు తొలగింపు నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



అమ్మఒడి లాలన.. జగనన్న దీవెన

చదువు 'కొనాల్సిన' పరిస్థితి నుంచి చదుకునే పరిస్థితులు కల్పించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ చదువు మానేయకూడదన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఇందులో భాగంగా నవరత్నాల్లో అమ్మఒడి పథకాన్ని చేర్చారు. ఏటా విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు చొప్పున నిధులు జమ చేస్తున్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా నెరవేరుతోంది. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం తమ పిల్లలకు కొండంత ఆలంబనగా ఉందన్న ఆనందం పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. నాలుగేళ్లలో మండలంలో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన కింద కోట్లాది రూపాయలను ప్రభుత్వం అందించింది.


హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

- పేదల చదువులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా
- ఏటా అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి కింద ఆర్థిక సాయం


పాఠశాలలో విద్యార్థినులు


హుకుంపేట కళాశాలలో విద్యార్థులు


పెదగరువు పాఠశాల

హుకుంపేట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడు పథకం ద్వారా పాఠశాల రూపురేఖలు మార్చివేసింది. ఆధునిక సదుపాయాలు కల్పించింది. జగనన్న గోరు ముద్ద ద్వారా నాణ్యమైన పోషకరమైన ఆహారాన్ని అందిస్తోంది. పేద కుటుంబాలు ఆర్థిక స్తోమత లేని కారణంగా తమ పిల్లలను బడి మాన్పించకుండా అమ్మఒడి పథకం ద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు పాఠశాలకు, కళాశాలలకు పంపించే పిల్లల తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15వేలు జమ చేస్తోంది. ఇక ఇంటర్‌తో చదువు ఆపకుండా ఉన్నత విద్య చదుకునే వారికోసం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఏటా రూ.8,750 చొప్పున ఏడాదికి మూడు విడతల్లో రూ.26,250(రియంబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు కళాశాల ఫీజులు బట్టి)చెల్లిస్తోంది. వసతిగృహాల్లో ఉంటూ చదువుకునే వారికోసం జగనన్న విద్యావసతి (రియంబర్స్‌మెంట్ ఆఫ్ మెయింటెనెన్స్ ఫీజు) పథకం ద్వారా ఏడాదికి రూ.20వేలు రెండు విడతల్లో చెల్లిస్తోంది. జగనన్న ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ మూడు పథకాల వల్ల ఏటా వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు ఎటువంటి ఆర్థిక ఇబ్బంది లేకుండా పూర్తి చేస్తున్నారు.

మండలం: హుకుంపేట

ప్రభుత్వ జూనియర్ కాలేజీ : 1

కేజీబీవీ:1, పాఠశాలలు : 213, విద్యార్థులు: 9,841

అమ్మఒడి పథకం వివరాలు :

- 2019-2020లో 1,106 మంది లబ్ధిదారులకు రూ.16.59కోట్లు
- 2020-2021లో 8,229 మందికి రూ.11.52కోట్లు
- 2022లో 6,019మందికి రూ.7.82కోట్లు
- 2023లో 9,841మందికి రూ. 12.79కోట్లు
- నాలుగేళ్లలో మొత్తం అందించిన నగదు: రూ.48.79 కోట్ల
- వసతి దీవెన 1010మందికి రూ.11,76కోట్లు
- విద్యాదీవెన 461మందికి రూ.4.49కోట్లు

జగనన్న సాయం ఆదుకుంది



మాది తీగలవలస పంచాయతీ గరుడాపల్లి గ్రామం. జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి ద్వారా రూ.15వేలు సాయంతో మా బిడ్డను ఇంటర్ వరకు చదివించాను. తర్వాత జగనన్న విద్యాదీవెన ద్వారా ఏడాదికి రూ.8750 చొప్పున మూడేళ్లకు రూ.26,250. నా ఖాతలో జమచేశారు. జగనన్న ప్రభుత్వ సాయం ఆదుకుంది.

– పాంగి గున్నమ్మ, విద్యార్థిని తల్లి

జగనన్నకు రుణపడి ఉంటాం



మాది హుకుంపేట మండలం గరుడాపల్లి గ్రామం. నిరుపేద కుటుంబానికి చెందిన నేను జగనన్న అమ్మఒడి ఆర్థిక సాయం ద్వారా ఇంటర్ పూర్తి చేశాను. ప్రస్తుతం చదువుతున్న నర్సింగ్ కోర్సులో జగనన్న విద్యా దీవెన ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. మాలాంటి పేద విద్యార్థులకు అండగా ఉంటున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– పాంగి లలిత, విద్యార్థిని

ప్రభుత్వం ప్రోత్సాహం



జగనన్న అమ్మఒడి, విద్యా, వసతి దీవేనల పథకాల ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. చదువుకునేందుకు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ పథకాలు పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, హుకుంపేట

అమ్మఒడితో పేదలకు మేలు



అమ్మఒడి పథకం ద్వారా పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం అందిస్తున్న సొమ్ముతో తమ పిల్లలను మంచి చదువులు చదివించాలన్న ఆలోచన వచ్చింది. పిల్లలను బడికి పంపించేందుకు ఆశక్తి చూపిస్తున్నారు.

– సోమేలి చెల్లయ్య, డిప్యూటీ డీఈవో, ఎంఈవో హుకుంపేట

వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి

అరకులోయ రూరల్: వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి చెప్పారు. పట్టణంలో శరభగూడ, హౌసింగ్ కాలనీ, పాత పోస్టాఫీసు వివిధ కాలనీల్లో అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణతో పాటు వారి సిబ్బందితో ఆదివారం పర్యటించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్ తదితర కేసులు నమోదవుతున్నాయని, ముందస్తు చర్యల్లో భాగంగా దోమల నివారణ మందు, బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. ప్రజలకు అనారోగ్యానికి గురైతే తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా సేవలు పొందాలన్నారు. ఎంటీఎస్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం


గ్రామస్తులకు బుక్‌లెట్‌లను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ నూకాలు, నేతలు

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో ఆదివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ అంబటి నూకాలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మన్యంలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. వివిధ పథకాల ద్వారా మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల వివరాలను తెలియజేశారు. సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల వారోత్సవాలు ప్రారంభం


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వినియోగదారుల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన విద్యార్థులు

సాక్షి, పాడేరు: జాతీయ వినియోగదారుల దినోత్సవానిన పురస్కరించుకుని వినియోగదారుల వారోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. వినియోగదారుల సంఘాల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు లకే నానిపాత్రుడు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పాంగి వెంకటరమణ, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్టీ హాస్టల్‌లో వారోత్సవాలను ప్రారంభించారు. వినియోగదారుల హక్కులు, చట్టాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కళాశాల వినియోగదారుల క్లబ్ చైర్మన్‌గా సింహచలంనాయుడు, కార్యదర్శిగా పంతులుబాబు, మరికొందరు విద్యార్థులను సభ్యులుగాను నియమించారు. పాడేరు పట్టణంలోని అన్ని దుకాణాలు, పెట్రోల్‌బంకుల్లో వినియోగదారుల హక్కులు, చట్టాల ప్రచార పోస్టర్లను అంటించారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం


శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి

మునగపాక : మండల వ్యాప్తంగా ఆదివారం మేలు కొలుపులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ధనుర్మాసం ప్రారంభంలో భాగంగా పలు దేవాలయాల నుంచి మేలు కొలుపు కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల పాటు ప్రత్యేక సేవలు, భజనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎస్.రాయవరం : మండలంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. దార్లపూడి శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి, వమ్మవరం శ్రీ స్వయంభూ వేంకటేశ్వరస్వామి, కొరుప్రోలు శ్రీ సీతారామస్వామి, ఎస్.శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఈ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. నెలరోజుల పాటు తిరుప్పావై పాసురాలు చదివి రోజు వారి పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

మునగపాక : మండల వ్యాప్తంగా ఆదివారం మేలు కొలుపులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ధనుర్మాసం ప్రారంభంలో భాగంగా పలు దేవాలయాల నుంచి మేలు కొలుపు కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల పాటు ప్రత్యేక సేవలు, భజనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు వారపు సంత

అనంతగిరి: మండల కేంద్రంలోని సంతబయలు వద్ద సోమవారం వారపు సంత జరుగుతుంది. గిరిజనులు అటవీ ఉత్పత్తులకు తీసుకువచ్చి విక్రయిస్తారు. అల్లం, తేనె, చీపుళ్ల తదితర అటవీ ఉత్పత్తులను అధికంగా వస్తాయి.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన చేస్తున్న కార్మికులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో గిరిజన మ్యూజియం, పద్మాపురం కొత్తవలస గార్డెన్‌లో పనిచేస్తున్న హెచ్ఎస్‌టీసీ కార్మికులు విధులు బహిష్కరించి ఆదివారం నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బాలదేవ్ మాట్లాడుతూ డైలీవెజ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. రాజు, రాంబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలి


జడ్పీటీసీ కిముడు శివరత్నం

గూడెంకొత్తవీధి: ఈనెల 21న అల్లూరి జిల్లా చింతపల్లికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని గూడెంకొత్తవీధి జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం అన్నారు. గిరిజన పక్షపాతిగా మన్యానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న పర్యటనను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన

మాడుగుల రూరల్: ఎం. కోడూరు సహకార సంఘం వద్ద డిజిటల్ అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, స్థానిక పీఏసీఎస్ ద్వారా అందిస్తున్న బ్యాంకింగ్ సేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా సదుపాయాలు గురించి సంఘ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేశ్ వివరించారు. సంఘ పరిధిలో మొండి బకాయిలు రూ.30 లక్షల వసూలు చేసినట్లు, సభ్య రైతులకు రూ.1.67 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. రానున్న రెండేళ్లలో సిబ్బంది కృషితో శతశాతం రుణాలు వసూలు చేసి సంఘ అభివృద్ధికి పాటుపడతామన్నారు. 2007లో తీసుకున్న రుణ బకాయిలు తిరిగి రెన్యువల్ చేసుకుంటే, ప్రభుత్వ రాయితీలకు అర్హత పొందుతారన్నారు. రుణ బకాయిదార్లు రెన్యువల్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సీఈవో రామునాయుడు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నూర్పులు


పనుల్లో నిమగ్నమైన రైతులు

కోటవురట్ల: మిచాంగ్ చేసిన గాయం నుంచి రైతులు తేరుకోలేకపోతున్నారు. తుపాను పోయి వారం రోజులు గడిచినా నేటికీ వరిచేలల్లో నీరు మాత్రం తొలగిపోలేదు. ఇంకా వరి చేలు ముంపులోనే ఉన్నాయి. ఆరుదల పెట్టిన చోట రైతులు నూర్పులు నిర్వహిస్తున్నారు. నీటిలో నానిన వరి పనలను నూర్పుడు యంత్రాలతో గింజలను వేరు చేస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టం గుర్తింపులో ఉదారంగా వ్యవహరించడంతో రైతులు కోలుకునే ప్రయత్నం చేస్తున్నారు.

చర్చిల్లో క్రిస్మస్ సందడి

బుచ్చెయ్యపేట: పలు గ్రామాల్లో చర్చిలు క్రిస్మస్ వేడుకలకు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని బుచ్చెయ్యపేట, వడ్డాది మేజరు పంచాయతీ, ఎల్.బి. పురం, దిబ్బిడి, రాజాం, సీతయ్యపేట, తురకలపూడి, మంగళాపురం, విజయరామరాజుపేట తదితర గ్రామాల్లో చర్చిలకు రంగులు వేసి భారీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల చర్చిల్లో క్రిస్మస్ ఫెలోషిప్ పేరుతో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


రంపచోడవరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో ఆదివారం దివంగత జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నాత్ర నాగమణి జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అయిన ఆమె భర్త ఆర్ఎంపీ వైద్యులు నాత్ర రవీంద్రవర్మ (ప్రత్తి శ్రీను) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య జ్ఞాపకార్థం మండల లోతట్టు గ్రామాల్లో కూడా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

రంపచోడవరం : రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 100 మంది రోగులకు వైద్యసేవలను అందించినట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయ నందజీ మహారాజ్ తెలిపారు. స్థానిక రామకృష్ణ మిషన్ సంచార వైద్యశాలలో ఆదివారం నిర్వహించిన శిబిర లో డాక్టర్ దాసరి ఉమా మహేష్, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ పాల్గొని వైద్య సేవలందించినట్లు స్వామీజీ తెలిపారు. శిబిరంలో 32 మందికి రక్త పరీక్షలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఫిజియథెరపీలు చేశామని, రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంప్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, సిబ్బంది వలంటీర్ వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలు


మూలపేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


నల్లమారమ్మ గుడి ఆవరణలో పూర్వ విద్యార్థులు

మునగపాక : మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కార్తీకమాసం పూర్తయిన సందర్భంలో పలువురు పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సందడి చేశారు. 1994-95లో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమీపంలోని పాటిపల్లి నల్లమారమ్మ గుడి ఆవరణలో ఆత్మీయ కలయిక నిర్వహించారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా మేఘాలయలో మిలటరీలో అమాల్దర్‌గా విధులు నిర్వహిస్తున్న పెంటకోట పట్టాభిని సత్కరించారు. కర్రి భాస్కరరావు, డాక్టర్ రవి, దొడ్డి వెంకటరమణ, మళ్ల పరదేశి నాయుడు, భీశెట్టి లక్ష్మణరావు, యల్లపు మోహన్ పాల్గొన్నారు. అలాగే 1975-76లో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు మూలపేటలోని గంగాలమ్మ తల్లి గుడి ఆవరణలో కలుసుకున్నారు. ఏవీ సత్యనారాయణ,సత్యనారాయణ,పెంటకోట వెంకట్,కబడ్డి శివ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

హరిపాలెం పాఠశాలలో...

అచ్యుతాపురం : అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.1997-98లో పదో తరగతి చదివిన ఈ విద్యార్థులు చిన నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.25 ఏళ్ల క్రితం పదో తరగతి పూర్తి చేసిన ఈ బ్యాచ్ విద్యార్థులు ఇక్కడ చిన్నపిల్లల్లా గడిపారు.

ఘనంగా అయ్యప్ప భక్తుల పేటతుల్లి

మునగపాక : తిమ్మరాజుపేటలో ఆదివారం పేటతుల్లి కార్యక్రమం ఘనంగా జరిగింది. అయ్యప్ప మాలలు ధరించిన 60 మంది భక్తులు కేరింతలు కొడుతూ అయ్యప్పస్వామి నినాదాలు చేస్తూ పేటతుల్లి ఆడారు. అయ్యప్పస్వామి ఆలయం నుంచి పలు వీధుల గుండా పేటతుళ్లి నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు తరలివచ్చారు.

రబీ సాగుకు సన్నద్ధం

మాడుగుల: ఒక వైపు ఖరీఫ్ వరి పంట పనులు చివరి దశకు చేరుకున్నాయి. రైతులు పొలాల్లో పంటను కళ్లాలకు చేర్చుతున్నారు. నూర్పులు ముమ్మరంగా చేస్తున్నారు. కొంతమంది రైతులు రబీ వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. రబీ వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అధికారులు ముందుగానే పంపిణీ చేశారు.